بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ    وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

**Summary of Friday Sermon Hazrat Khalifatul Masih V 12.07.2024 (Telugu)**

# బనూ ముస్తలఖ్ యుద్ధ సంఘటనలు, ముహర్రమ్ సందర్భంగా దుఆల పిలుపు

**హుజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 12.07. 2024 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, లండన్, ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము**

أَشۡهَدُ أَنۡ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحۡدَهٗ لَا شَرِيۡكَ لَهٗ وَأَشۡهَدُ أَنَّ مُحَمَّدًا عَبۡدُهٗ وَرَسُوۡلُهٗ أَمَّا بَعۡدُ فَأَعُوۡذُ بِاللّٰهِ مِنَ الشَّيۡطٰنِ الرَّجِيۡمِ. بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ. اَلۡحَمۡدُ لِلّٰهِ رَبِّ الۡعٰلَمِيۡنَ. الرَّحۡمٰنِ الرَّحِيۡمِ. مٰلِكِ يَوۡمِ الدِّيۡنِ. إِيَّاكَ نَعۡبُدُ وَإِيَّاكَ نَسۡتَعِيۡنُ. اِهۡدِنَا الصِّرَاطَ الۡمُسۡتَقِيۡمَ. صِرَاطَ الَّذِيۡنَ أَنۡعَمۡتَ عَلَيۡهِمۡ غَيۡرِ الۡمَغۡضُوۡبِ عَلَيۡهِمۡ وَلَا الضَّآلِّيۡنَ.

తషహ్హుద్, తఅవ్వుజ్, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు.

నేడు బనూ మస్తలఖ్ లేదా ముర్రైసీ యుద్ధం గురించి ప్రస్తావింతును. ఈ యుద్ధం ఎప్పుడు జరిగింది? దీని గురించి చరిత్రకారులలో విభేదాలు గలవు. కొందరి దృష్టిలో ఇది 6వ హిజ్రిలో మరికొందరి దృష్టిలో 5వ లేదా 4వ హిజ్రి సం॥లో జరిగింది. కాని హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ గారు (రజి) పరిశోధన ప్రకారం హిజ్రి 5వ సం॥ షాబాన్ నెలలో జరిగింది. ఈ యుద్ధం బనూ ఖుజాఅ తెగ అయిన బనూ మస్తలఖ్‌తో జరిగింది. అందుకే దీనిని బనూ ముస్తలఖ్ యుద్ధం అంటారు. ముర్రైసీ నామము గల ఒక బావి వద్ద ఈ తెగస్తులు నివసించేవారు. అందుకే ఈ యుద్ధంనకు రెండవ పేరు ముర్రైసీ అని పడింది.

బనూ ముస్తలఖ్ ఖురైష్‌లకు మిత్రపక్షంగా ఉండేవారు. మేము కలిసికట్టుగా ఖురైష్‌కు తోడుగా ఉంటామని వీరు ప్రమాణం చేసి ఉండిరి. ఇదే ఒప్పందం వలన బనూ ముస్తలఖ్ తెగస్తులు ఉహద్ యుద్ధంలో ఖురైష్‌ల సైన్యంలో పాల్గొనిరి.

ఈ యుద్ధానికి ఒక కారణం ఇట్లు గలదు. బనూ ముస్తలఖ్ ఇస్లాం శత్రుత్వంలో చాలా విచ్చలవిడిగా వ్యవహరించేవారు. వారికి అవిశ్వాసులైన ఖురైష్‌ల పూర్తి సహాయ సహకారాలు ఉండెను. ఉహద్ యుద్ధంలో ముస్లింలకు విరుద్ధంగా వీరు పాల్గొన్నందున ఇప్పుడు బహిరంగంగా ముస్లింలతో పోటీకి వీరు సిద్ధమైరి. వీరి ఆగడాలు పెరిగిపోతుండెను. రెండవ కారణం ఏమనగా పవిత్ర మక్కా నుండి ప్రధాన రహదారులపై వీరికి పూర్తి పట్టు ఉండెను. మక్కాలో ముస్లింలు జోక్యం చేసుకోకుండా వీరు గట్టి ఆటంకాలను సృష్టించేవారు. మూడవ కారణం ఏమనగా బనూ ముస్తలఖ్ నాయకుడు హారిస్ బిన్ అబి జిరార్ తమ జాతి మరియు అరబ్ ప్రజలను హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంతో యుద్ధం చేయుటకు సన్నద్ధం చేసెను. మదీనా నుండి 96 మైళ్ల దూరాన ఒక ప్రాంతంలో సైన్యంను ప్రోగు చేయడం మొదలు పెట్టెను.

సీరత్ ఖాతమున్నబియ్యీన్ అనే పుస్తకంలో హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ గారు (రజి) దీని

గురించి ఇట్లు వ్రాశారు. ఖురైష్‌ల వ్యతిరేకత రోజు రోజుకు ఇంకా భయంకరమైన పరిస్థితి దాల్చుతుండెను. వారు తమ కుట్రలతో అరబ్‌లోని అనేక తెగలను ఇస్లాం, ఇస్లాం వ్యవస్థాపకులకు విరుద్ధంగా సిద్ధం చేశారు. కాని ఇప్పుడు వారి శత్రుత్వం ఒక క్రొత్త ప్రమాదాన్ని సృష్టించెను. ఇప్పటి వరకు ముస్లింలతో సత్సంబంధాలు కలిగి ఉన్న హిజాజ్ తెగలు సైతం ఖురైష్‌ల కుట్రల ఫలితంగా ముస్లింలకు విరుద్ధంగా మారడం మొదలైరి. ఈ విషయంలో బనూ ఖజాఅ తెగలోని ఒక శాఖ బనూ ముస్తలఖ్ ముందడుగు వేసి మదీనాపై దాడికి సన్నాహాలు ప్రారంభించెను. వారి నాయకుడు హారిస్ బిన్ అబీ జిరార్ ఈ ప్రాంతంలోని ఇతర తెగలను తమ వెంట కలుపుకొనెను.

మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు దీని సమాచారం తెలియగా వారు స.అ.స. ముందు జాగ్రత్తగా ఒక అనుచరుడు బురైదహ్ బనిల్ హుసైబ్ (రజి)ను పరిస్థితులను తెలుసుకొనుటకు బనూ మస్తలఖ్ వైపు పంపిరి. వారు స.అ.స. ముస్లింలను పిలిపించుకొని శత్రువుల గురించి సమాచారం అందించిరి. కావున ఇస్లామీ సైన్యం త్వర త్వరగా సిద్ధమై బయలు దేరిరి.

వారు స.అ.స. ప్రయాణ వివరాలు ఇట్లు గలవు. ఒక కథనం ప్రకారం వారు స.అ.స. హజ్రత్ జైద్ బిన్ హారిస (రజి) ను మదీనాలో తమ స్థానంలో నియమించిరి. ఇబ్నె హిషామ్ మాత్రం హజ్రత్ అబూ జర్ ఘఫ్ఫారి (రజి) పేరును ప్రస్తావించారు. ఇదే విధంగా హజ్రత్ నుమైలహ్ బిన్ అబ్దుల్లాహ్ పేరు కూడ ప్రస్తావించబడెను. సారాంశమేమనగా సైన్యం బయలు దేరినది. ఇస్లామీ సైనికుల సంఖ్య 700 ఉండెను. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఐదవ హిజ్రి సం॥ షాబాన్ నెల 2వ తేదీన సోమవారం రోజున పవిత్ర మదీనా నుండి బనూ ముస్తలఖ్‌కు బయలు దేరిరి. మార్గదర్శకునిగా (దారి చూపుటకు) హజ్రత్ మస్ఊద్ బిన్ హునైదహ్ (రజి) ఉండిరి. దీని వివరాలు ఇంకా ఇట్లు ప్రస్తావించబడెను. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వెంట చాలా మంది దాంబికులు కూడ బయలు దేరారు. ఇంతకు ముందు వారెన్నడు మరో యుద్ధం కొరకు ఇలా బయలు దేరలేదు. వారి ఉద్ధేశం (పుణ్యం కొరకు) యుద్ధం చేయుట కాక శత్రువుల సామాగ్రిని పొందుట మాత్రమే. విజయం లభించినచో మాకు శత్రువుల సామాగ్రి లభించునని వారు భావించిరి.

సైన్యంలో 30 అశ్వములు మాత్రమే ఉండెను. కాని ఒంటెల సంఖ్య కొంచెం ఎక్కువే ఉండెను. ఆయా అశ్వములు, ఒంటెలనే ముస్లింలు వంతులవారీగా వాడుతుండిరి. మార్గంలో అవిశ్వాసుల ఒక గూఢచారి ముస్లింలకు లభించెను. అతణ్ణి పట్టుకొని మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు తీసుకొచ్చిరి. అతడు నిజంగానే గూఢచారి అని నిర్ధారించు కున్న తర్వాత వారు స.అ.స. అతనితో అవిశ్వాసుల పరిస్థితుల గురించి ప్రశ్నించిరి. కాని అతడు చెప్పుటకు నిరాకరించెను. అతని వ్యవహారం కూడ అనుమానాస్పదంగా ఉండెను. కావున అప్పటి యుద్ధ చట్టం మేరకు అతణ్ణి హజ్రత్ ఉమర్ (రజి) హత్య చేసిరి. అనంతరం ముస్లింల సైన్యం ముందుకు బయలు దేరెను.

ముస్లింల రాక గురించి, తమ గూఢచారుని మరణ వార్త బనూ ముస్తలఖ్‌కు అందినప్పుడు వారు చాలా భయానికి గురైరి. ఎందుకనగా వారు మదీనాపై అకస్మాత్తుగా దాడి చేయుటకు అవకాశం లభించాలని ఆశిస్తుండిరి. కాని మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ముందుచూపు వలన వారి

కుట్ర వారిపైనే తిరగబడింది.

వారు చాలా భయపడిరి. కావున వారి సహాయానికి గుమికూడిన ఇతర తెగస్తులు కూడ దైవ మహిమతో భయపడి తక్షణమే వారిని వదిలి పెట్టి తమ తమ గృహాలకు తిరిగి వెళ్లిపోయిరి. బనూ ముస్తలఖ్‌కు మాత్రం ఖురైష్‌లు ముస్లింల పట్ల ద్వేషం, శత్రుత్వంను బాగా నూరిపోసినందున ఇప్పటికి వారు యుద్ధ సంకల్పంను వీడలేదు. అన్నిరకాల పూర్తి సన్నాహాలతో ఇస్లామీ సైన్యంను ఎదురుకొనుటకు సిద్ధమై ఉండిరి.

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మురైసీ చేరుకున్నప్పుడు వారి స.అ.స. కొరకు చర్మ గుడారం ఏర్పాటు చేయబడెను. హజ్రత్ ఆయిషా సిద్ధీఖహ్ (రజి) వారి స.అ.స. వెంట ఉండిరి. వారు స.అ.స. అనుచరులను వరుసలలో నిలబెట్టిరి. ముహాజిర్ల (వలసదారుల) పతాకంను హజ్రత్ అబూబక్ర్ సిద్దీఖ్ (రజి)కు అప్పగించిరి. మరో కథనం ప్రకారం హజ్రత్ అమ్మార్ బిన్ యాసిర్ (రజి) కు అప్పగించిరి. అన్సార్ పతాకం హజ్రత్ సాద్ బిన్ ఉబాదహ్ (రజి)కు ఇచ్చిరి. శత్రువుల సైన్యం ముందట ఇట్లు ప్రకటించమని హజ్రత్ ఉమర్ (రజి)ను వారు స.అ.స. ఆదేశించారు. ఓ ప్రజలారా! అల్లాహ్ తప్ప మరొకరు ఆరాధనకు అర్హులు లేరు. అతని ద్వారా తమ ప్రాణాలను, ధనములను రక్షించుకోండి. హజ్రత్ ఉమర్ (రజి) ఇలాగే ప్రకటించిరి. కాని అన్యారాధకులు నిరాకరించిరి. కొంత సమయం వరకు పరస్పరం బాణాలు విసురుకున్నారు.

అందరికంటే ముందు అన్యారాధకులలోని ఒక వ్యక్తి బాణం విసిరెను. కావున ముస్లింలు కూడ కొంత సమయం వరకు బాణాలను విసిరారు. అనంతరం వారు స.అ.స. దాడి చేయాలని అనుచరులను ఆదేశించారు. వారు మూకుమ్మడిగా దాడికి పాల్పడ్డారు. అన్యారాధకులలో ఎవరు పారిపోలేదు. వారిలోని 10 మంది హత్యకు గురి కాగా మిగతా వారు బంధించబడిరి. వారు స.అ.స. శత్రువుల పురుషులు, స్త్రీలు, పిల్లలు, పశువులను బంధించిరి.

హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ గారు (రజి) దీని వివరాలు ఇట్లు వ్రాశారు. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మురైసీ చేరుకున్నప్పుడు గుడారాం వేయాలని ఆదేశించారు. వరుసలలో నిలబెట్టి, జెండాలను పంచిన తర్వాత వారు స.అ.స. ఆదేశం మేరకు హజ్రత్ ఉమర్ (రజి) బనూ ముస్తలఖ్‌ను ఉద్దేశించి ఇట్లు ప్రకటించిరి. ఇప్పటికి ఇస్లాం పట్ల శత్రుత్వంను వీడి, మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రభుత్వంను స్వీకరించినచో వారికి శాంతి ఇవ్వబడును. ముస్లింలు తిరిగి వెళ్లిపోవుదురు. కాని వారు గట్టిగా తిరస్కరించి, యుద్ధం కొరకు సిద్ధమైరి. తుదకు మొట్టమొదటి బాణం ఈ యుద్ధంలో వారిలోని ఒక వ్యక్తియే విసిరెను. వారి ఈ పరిస్థితిని చూసి మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం దాడి చేయాలని అనుచరులను ఆదేశించిరి. కొంచెం సమయం తర్వాత ఇరు పక్షాల తరపున బాగా బాణాలు విసురుకోవడం జరిగెను. దాని తర్వాత దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మూకుమ్మడిగా దాడి చేయాలని ఆదేశించారు. ఈ ఆకస్మిక దాడి ఫలితంగా అవిశ్వాసులు నిలబడలేక పోయారు. అప్పుడు ముస్లింలు ఎంతో తెలివితో వారిని చుట్టుముట్టిరి. తద్వారా మొత్తం జాతి చుట్టుముట్టబడినందున వారు ఆయుధాలు పడవేసిరి. కేవలం పది మంది అవిశ్వాసులు మరియు ఒక ముస్లిం హత్యకు గురికాగా

తీవ్ర రూపం దాల్చుతున్నట్లు కనిపిస్తున్న ఈ యుద్ధం అంతమైనది.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. నేడు ముహర్రమ్ సందర్భంగా దుఆ వైపు కూడ సూచించదల చితిని. ఇదొక బాధాకరమైన సంఘటన. ఇందులో క్రూరత్వం, హింసతో కూడిన ఘోరమైన సంఘటన సంభవించెను. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం (నవాసా) మనువడిని, వారి స.అ.స. కుటుంబ ప్రజలను హత్య (షహీద్) చేయబడెను. కాని ముస్లింల దురదృష్టమేమనగా ఈ సంఘటనతో గుణపాఠం నేర్చుకునే బదులు ఈ హింస ఇప్పటికి కొనసాగుతున్నది. ముహర్రమ్‌లో షియా సున్నీ అల్లర్లు లేదా తీవ్రవాద దాడులు పెరుగుతున్నాయి. రెండు వైపుల ప్రాణాలు వృథా అవుతున్నాయి. ఈ అల్లర్లను అంతం చేయడానికి అల్లాహ్ తఆలా తన వాగ్దానం మేరకు తగిన ఏర్పాట్లు చేసెను. అతణ్ణి స్వీకరించుటకు వీరు సిద్ధంగా లేరు. బహుశా ప్రజలకు అర్థమైనచో బాగుండును. ఏది ఏమైనప్పటికి ఈ రోజులలో అహ్మదీయులు దురూద్ షరీఫ్ పఠించుటకు మరియు ముస్లింల ఐక్యత కొరకు ప్రత్యేక దుఆల వైపు దృష్టి సారించవలెను. తమ స్థితులను మెరుగు పరచుకొనుటకు మరియు అల్లాహ్ తఆలాతో సంబంధంలో ముందడుగు వేయుటకు ప్రత్యేక దృష్టి సారించవలెను. అల్లాహ్ తఆలా అందరిని ఇందుకు అనుగ్రహించు గాక!

చివరలో హుజూరె అన్వర్ గౌ॥ బోంజా మహ్మూద్ గారు ఆఫ్ టోగా అమరులైన విషయంను ప్రస్తావించారు. ఇలాగే గౌ॥ రషీద్ అహ్మద్ గారు, గౌ॥ చౌద్రీ ముతీఉర్రహ్మాన్ గారు, గౌ॥ మన్సూర్ బేగం గారు మరియు మాస్టర్ సఆదత్ అష్రఫ్ గారి మరణ వార్త తెలిపి వారి సద్గుణాలు, వారి జమాఅత్ సేవలను ప్రస్తావించారు. ఈ మృతుల పరోక్ష అంత్యక్రియ ప్రార్థన చదివింతునని హుజూరె అన్వర్ ప్రకటించిరి.

اَلْحَمْدُ لِلّٰهِ نَحْمَدُهٗ وَنَسْتَعِيْنُهٗ وَنَسْتَغْفِرُهٗ وَنُؤْمِنُ بِهٖ وَنَتَوَكَّلُ عَلَيْهِ۔ وَنَعُوْذُ بِاللّٰهِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَيِّئَاتِ اَعْمَالِنَا۔ مَنْ يَّهْدِهِ اللّٰهُ فَلَا مُضِلَّ لَهٗ وَمَنْ يُّضْلِلْهُ فَلَا هَادِيَ لَهٗ۔ وَنَشْهَدُ اَنْ لَّآ اِلٰهَ اِلَّا اللّٰهُ وَنَشْهَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ۔ عِبَادَ اللّٰهِ رَحِمَكُمُ اللّٰهُ! اِنَّ اللّٰهَ يَأْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِيْتَآءِ ذِي الْقُرْبٰى وَيَنْهٰى عَنِ الْفَحْشَآءِ وَالْمُنْكَرِ وَالْبَغْيِ۔ يَعِظُكُمْ لَعَلَّكُمْ تَذَكَّرُوْنَ۔ اُذْكُرُوا اللّٰهَ يَذْكُرْكُمْ وَادْعُوْهُ يَسْتَجِبْ لَكُمْ وَلَذِكْرُ اللّٰهِ اَكْبَرُ۔

*(Summary: Office Nashr-o-Isha'at, Translation: Incharge Telugu Desk)*